సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి


విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. - 8లో▸



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బుధవారం యామన విశాలాక్షి (సామర్లకోట), కె.వెంకటలక్ష్మి (విశాఖపట్నం) రూ.1,00,116 చొప్పున విరాళాలు సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.50 అడుగులకు చేరింది.

నీటి సరఫరాకు నిధుల ప్రవాహం



లొల్ల లాకుల వద్ద డెల్టా కాలువ

- ఉమ్మడి జిల్లాకు రూ.11.75 కోట్లు
- గోదావరి డెల్టా, ఏలేరు ఆయకట్టుకు కేటాయింపు
- క్రాస్‌బండ్ల ఏర్పాటు, తూడు తొలగింపు పనులు మరూ
- నీటి తోడకానికి డీజిల్ ఖర్చులకూ అనుమతి

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా, ఏలేరు రిజర్వాయర్ పరిధుల్లో రబీ నీటి సరఫరాకు అవాంతరాలు రాకుండా అవసరమైన చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో రబీ ఆయకట్టుకు నీరందించేలా చేయాల్సిన అత్యవసర పనులకు నిధులు మంజూరు చేసింది. పంట కాలువల్లో పూడిక తొలగింపు, ఇతర అత్యవసర పనులు, మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌ల నిర్మాణం, పంట కాలువలు, డ్రెయిన్ల నుంచి నీటి తోడకానికి గాను రూ.11.75 కోట్లు కేటాయించింది. గోదావరి తూర్పు, మధ్య డెల్టాల్లోని అమలాపురం, రామచంద్రపురం సబ్ డివిజన్లకు, పశ్చిమ డెల్టా పరిధిలోని నిడదవోలు సబ్ డివిజన్‌తో పాటు మురుగునీటి కాలువలకు సంబంధించి కాకినాడ డివిజన్ పరిధిలో ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

డీజిల్‌కు కేటాయింపులు ఇలా..

- గోదావరి డెల్టా, ఏలేరు రిజర్వాయర్ పరిధిలో రబీ సాగుకు నీటి ఇబ్బంది రాకుండా పంట కాలువలు, మురుగునీటి కాలువల్లో నిల్వ ఉన్న నీటిని రైతులు తోడుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం 68 పనులకు రూ.588.97 లక్షలు కేటాయించారు.
- రామచంద్రపురం డివిజన్ పరిధిలో 43 పనులకు రూ.338.23 లక్షలు, అమలాపురం పరిధిలో 8 పనులకు రూ.86.64 లక్షలు, నిడదవోలులో 16 పనులకు రూ.151.10 లక్షలు, ఏలేరు పరిధిలో పెద్దాపురం డివిజన్‌లో ఒక పనికి రూ.7 లక్షల చొప్పున కేటాయించారు.

క్రాస్‌బండ్లకు ఈ విధంగా..

- గోదావరి డెల్టా, ఏలేరు జలాశయం ఆయకట్టులోని మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్ల ఏర్పాటు ద్వారా నీటిని నిల్వ చేసి చేలల్లోకి మళ్లించేందుకు నిధులు మంజూరయ్యాయి. మొత్తం 44 చోట్ల క్రాస్‌బండ్ల ఏర్పాటుకు రూ.372.29 లక్షలు కేటాయించారు.



ఆత్రేయపురం వద్ద మోటార్లతో నీటి తోడకం (ఫైల్)

ప్రాజెక్టు/డివిజన్	కేటాయించిన పనులు	కేటాయింపులు (రూ.లక్షలలో)
గోదావరి తూర్పు డెల్టా, రామచంద్రపురం	43	338.23
గోదావరి సెంట్రల్ డెల్టా, అమలాపురం	9	95.54
డ్రెయిన్స్ డివిజన్, కాకినాడ	40	336
గోదావరి పశ్చిమ డెల్టా, నిడదవోలు	44	329.38
ఏలేరు రిజర్వాయర్, పెద్దాపురం	18	68.58
మొత్తం	154	1,167.73

- అమలాపురం సబ్ డివిజన్ పరిధిలో ఒక పనికి రూ.8.90 లక్షలు, నిడదవోలు పరిధిలో ఒక పనికి రూ.5.67 లక్షలు, కాకినాడ డ్రెయిన్స్ పరిధిలో 33 పనులకు రూ.330.80 లక్షలు, ఏలేరు పరిధిలోని పెద్దాపురంలో 9 పనులకు రూ.26.12 లక్షల చొప్పున కేటాయించారు.

ఓ అండ్ ఎం పనులకు..

- పంట కాలువలు, మురుగునీటి కాలువలకు సంబంధించి చేపట్టాల్సిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం)కు సంబంధించిన 35 పనులకు ప్రభుత్వం రూ.215.24 లక్షలు కేటాయించింది.
- ఏలేరు ఆయకట్టు పరిధిలోని పెద్దాపురం సబ్ డివిజన్‌లో 8 పనులకు రూ.35.46 లక్షలు, గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలోని నిడదవోలు సబ్ డివిజన్‌లో 27 పనులకు రూ.179.78 లక్షలు కేటాయించారు.

ఉప్పలగుప్తం మండలం కూనవరం మేజర్ డ్రెయిన్‌పై క్రాస్‌బండ్ (ఫైల్)





ఏలేరు కాలువ

న్యూస్‌రీల్

రూ.21 లక్షలతో స్లూయిజ్ షట్టర్లకు మరమ్మతులు



షట్టర్ల మరమ్మతు పనుల్ని పరిశీలిస్తున్న హెడ్‌వర్క్స్ ఈఈ విశ్వేశ్వరరావు

మామిడికుదురు: వైనతేయ కుడి కరకట్ట పరిధిలో పాడైపోయిన అవుట్ ఫాల్ స్లూయిజ్ షట్టర్ల మరమ్మతు పనుల్ని హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్ కాశీవిశ్వేశ్వరరావు, డీఈఈ జి.శ్రీనివాస్, ఏఈ టీవీఎల్ఎస్ మూర్తి బుధవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కేటాయించిన ప్రత్యేక నిధులు రూ.21 లక్షలతో మూడు షట్టర్ల మరమ్మతు పనులు చేపట్టారు. మండల పరిధిలోని బచ్చలబంద, వాడబోది, కడలి అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల షట్టర్లు పాడైపోయి రైతులు ఏటా ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. గోదావరి వరదలు, భారీ వర్షాల సమయంలో రైతులకు అవస్థలు తప్పడం లేదు. షట్టర్లు పాడైపోవడం వల్ల ఆరుగాలం శ్రమించి పండించిన పంట ముంపు బారిన పడుతోంది. చాలాకాలంగా ఈ సమస్య రైతులను వేధిస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై స్పందించిన కలెక్టర్ షట్టర్ల మరమ్మతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ఇటీవల పనులు చేపట్టారు. ఆ పనుల్ని ఈఈ విశ్వేశ్వరరావు, డీఈఈ శ్రీనివాస్, ఏఈ మూర్తి పరిశీలించారు. మూడు అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతు పనుల్ని పూర్తి చేసి రైతులకు ముంపు సమస్య లేకుండా చేస్తామని ఈఈ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు.

వీరేశ్వరునికి రజత సింహాసనం సమర్పణ



దాత సమర్పించిన రజత సింహాసనం

ఐ.పోలవరం: నిత్యకల్యాణం-పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామివారికి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త నడింపల్లి వీరవెంకట సత్యశ్రీహరి వర్మ దంపతులు రూ.15 లక్షల విలువ చేసే గజవాహన సహిత రజత సింహాసనాన్ని సమర్పించారు. తెనాలికి చెందిన ర్యాలి చంద్రశేఖరాచార్యులు ఇత్తడి ఏనుగుల రథంపై రజత సింహాసనం తయారు చేశారు. బుధవారం ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం ఆలయానికి సింహాసనాన్ని అందించారు. దాతను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ దుశ్శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.


జిల్లా విద్యాశాఖాధికారిణిగా కమలకుమారి



బాధ్యతలు స్వీకరిస్తున్న కమలకుమారి

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారిణిగా ఎం.కమలకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ డీఈఓగా పనిచేస్తున్న ఎస్‌వీ రవిసాగర్ ఏలూరు జిల్లాకు బదిలీపై వెళ్లడంతో విజయవాడ సర్వశిక్షాభియాన్ ఏడీగా పనిచేస్తున్న కమలకుమారి డీఈఓగా బదిలీపై వచ్చారు. ఆమె ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ ఉద్యోగులు, జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలు ఆమెకు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్



గాయత్రిని (బ్లూ జెర్సీ) విన్నర్‌గా ప్రకటించిన రిఫరీ

అల్లవరం: ఓడలరేవుకు చెందిన పినపోతు గాయత్రి జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. న్యూఢిల్లీలో కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అమర్ షాహిద్ జనరల్ బిపిన్‌రావత్ మెమోరియల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ నుంచి గాయత్రి పాల్గొంది. వైజాగ్‌లోని ఎంఎస్ రాజు కళాశాలలో ఇంటర్ చదువుతున్న గాయత్రి పతకం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిష్టాత్మకంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

డీఈఓ కమలకుమారి



అంబాజీపేటలో వైజ్ఞానిక ప్రదర్శనపై మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన తరువాత ఎంతో ప్రతిష్టాత్మకంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 16,17వ తేదీల్లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.కమలకుమారి చెప్పారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో డీఈవో బుధవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని 22 మండలాల నుంచి 5 టీమ్‌ల వంతున 110 ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ఉంచనున్నారన్నారు. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్, గణిత అంశాలు, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, పర్యావరణానికి మేలు చేసే అంశాలు, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి ఐదు అంశాలపై ఈ ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఈ ప్రదర్శనలో జిల్లా పరిషత్, ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ 110 అంశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేస్తామన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన 10 ప్రాజెక్ట్‌ల విద్యార్థులను రాష్ట్ర స్థాయికి సిఫారసు చేస్తామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనకు 72 మంది సిబ్బందిని నియమించామని సైన్స్ అధికారి గిరిజాల వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఉదయం రిజిస్ట్రేషన్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, సభా కార్యక్రమాలు, జిల్లా విద్యావైజ్ఞానిక శాస్త్ర స్టాల్స్, విద్యార్థుల సందర్శన, సైంటిఫిక్ మ్యాజిక్ షో, పప్పెట్రీ డాన్స్ షో, విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు నిర్వహించనున్నామన్నారు. అంతకుముందు జిల్లా నుంచి వచ్చిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉప విద్యాశాఖాధికారి పి.షాలెంరాజు, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి బీర హనుమంతరావు, ఎంఈఓలు క్రిష్టోఫర్ కొర్నిలీయస్, కోన హెలినా, కిరణ్‌బాబు, హెచ్‌ఎంలు మోకా ప్రకాష్, రిటైర్డ్ హెచ్‌ఎం రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు రాయితీలు అందేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

అల్లవరం: ఆక్వా రైతులకు ప్రభుత్వ రాయితీలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని అల్లవరం మండలం ఆక్వా జోన్ పరిశీలకులు, జిల్లా వ్యవసాయాధికారి కాకి నాగేశ్వరరావు అన్నారు. ఈ ఫిష్ సర్వేలో భాగంగా విద్యుత్ రాయితీ కోల్పోయిన కొంతమంది రైతులు.. ప్రభుత్వ రాయితీలు అందడంలేదని జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆక్వా జోన్‌లో ఉన్న చెరువులకు విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందా.. లేదా, జోన్, నాన్ ఆక్వా జోన్ సర్వే నంబర్లను పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయాధికారిని కలెక్టర్ నియమించారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వాజోన్‌లను సర్వే నంబర్లను పరిశీలించేందుకు గుండెపూడి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. గుండెపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లను ఆయన పరిశీలించారు. గుండెపూడి గ్రామంలో సవరించిన ఈ ఫిష్ జాబితాను రైతులకు చదివి వివరించారు. అర్హత ఉండి ఆక్వా జోన్ పరిధిలోకి రాని ఆక్వా రైతులు మత్స్యశాఖకు చెందిన సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతుకి ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. ఆక్వా జోన్‌లో ఉండి, ప్రభుత్వ గెజిట్ పొంది, సబ్ డివిజన్ అయిన సర్వే నంబర్లు నాన్ ఆక్వా జోన్ పరిధిలోకి వస్తున్నాయని, వాటిని సవరించి ఆక్వా జోన్‌లోకి మార్చాలని రైతులు జేడీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సవరిస్తామని హామీ ఇచ్చారు. ఎఫ్‌డీఓ హేమానంద్, వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ, మత్స్యశాఖ సహాయకులు ఎం.నరసింహ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన

అమలాపురం రూరల్: ఈ నెల 20వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు జరిగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరిగే పాఠ్యాంశాల పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా సమన్వయ కమిటీ సభ్యులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పరీక్ష రోజున ప్రశ్నపత్రాలను డిపాజిట్ చేయడానికి, ఉపసంహరించుకోవడానికి చీఫ్ సూపరింటెండెంట్లకు, కస్టోడియన్లను అనుమతించాలని కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. మధ్యాహ్నం సెషన్‌లో సమాధాన పత్రాల బండిల్స్‌ను డిపాజిట్ చేయడానికి, చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసివేసే ఏర్పాట్లు చేయాలని జిల్లాలోని ఎస్సైలకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. పురపాలక సంఘ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి పరీక్ష కేంద్రాల్లో పారిశుధ్య పనులు, అవసరమైన ఏర్పాట్లు చేయడంతోపాటు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యాన్ని పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను ప్రకటించాలన్నారు. ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి సూచన ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి అవసరమైన ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలకు వసతి కల్పించడానికి పొరుగు సేవలు, పాఠశాలల ఉపాధ్యాయుల ఇన్విజిలేషన్ సేవలను అందించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందికి ప్రథమ చికిత్స కిట్‌ను అందించడం, ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్య సిబ్బందికి సూచనలు జారీ చేయాలన్నారు. ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి, డిపోల మేనేజర్లు విద్యార్థుల కోసం సమయాలకు పరీక్షా కేంద్రాలు చేరుకునేలా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత సంబంధిత పోస్టల్ చీఫ్ సూపరిం టెండెంట్లు ఆన్సర్ స్క్రిప్ట్ బండిల్స్‌ను అనుమతించి భద్రపరచాలన్నారు.

అక్రమార్కులపై విజిలెన్స్

- దర్జాగా బియ్యం అక్రమ రవాణా
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దందా
- విజిలెన్స్ అధికారుల ఉక్కుపాదం
- రూ.10.41 కోట్ల విలువైన సరకు సీజ్
- 35 మందిపై క్రిమినల్ కేసులు
- 119 మంది ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ
- బియ్యాన్ని నూకలుగా మార్చి మరీ తరలింపు



కొవ్వూరులో ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం



రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల సోదాలు

సాక్షి, రాజమహేంద్రవరం: బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. సరిహద్దు, సాధారణ ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేస్తోంది. అధికారుల కళ్లుగప్పి తరలిస్తున్న వారికి సంబంధించి సమాచారం అందుకుని దాడులు విస్తృతం చేస్తోంది. పట్టుబడిన లారీలు, బియ్యం బస్తాలను సీజ్ చేస్తోంది. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా క్రిమినల్ కేసులు పెడుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు ఏకంగా రూ.10.41 కోట్ల విలువ చేసే సరకు సీజ్ చేశారు.

ఉమ్మడి తూర్పులో ఇలా..

చౌకబియ్యం, ధాన్యం, రంగు మారిన ధాన్యం, ఆఖరికి అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అందించే పోషకాహార ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సైతం అక్రమ రవాణా చేస్తున్నారు. బియ్యం ఊకను సైతం వదలడం లేదన్న అంశం బహిర్గతమైంది. మరికొందరు బియ్యం రవాణాకు బిల్లులున్నా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా తరలిస్తున్నట్లు తేలింది. వీటన్నింటిపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 35 ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955 కింద 6ఏ కేసులు నమోదు చేశారు. మరో 35 మందిపై క్రిమినల్ కేసులు పెట్టారు. ఇందులో 119 మంది పాల్గొన్నట్లు నిర్ధారించారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు రూ.10,41,15,232 విలువ చేసే సరకును సీజ్ చేశారు.

పట్టుబడిన పీడీఎస్ బియ్యం:	7017.80 క్వింటాళ్లు
ధాన్యం :	16,612.33 క్వింటాళ్లు
విరిగిన బియ్యం :	274.5 క్వింటాళ్లు
రంగుమారిన బియ్యం :	198.5 క్వింటాళ్లు
సాధారణ బియ్యం :	8422.73 క్వింటాళ్లు
ఫోర్టిఫైడ్ రైస్ :	186 క్వింటాళ్లు
బియ్యం ఊక :	51.75
సన్నబియ్యం :	39 క్వింటాళ్లు
సరకు విలువ :	రూ.10,41,15,232
6ఏ-కేసులు :	35
క్రిమినల్ కేసులు :	35
అక్రమ రవాణాలో పాల్గొన్నవారు :	119


దాడులు చేస్తున్నా..

బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. ధనార్జనే ధ్యేయంగా సాగుతోంది. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కిలో రూ.7 నుంచి రూ.10ల చొప్పున సేకరిస్తోంది. వాటిని నూకలు, పిండిగా మార్చి పౌల్ట్రీ సంస్థలకు రూ.18 నుంచి రూ.25కు విక్రయిస్తోంది. తూర్పులో పౌల్ట్రీ పరిశ్రమలు అధికంగా ఉండటంతో క్వింటాళ్ల కొద్దీ బియ్యం ఇక్కడకు దిగుమతి అవుతోంది. ఇళ్ల నుంచి బియ్యం కొనుగోలు చేసే చిరువ్యాపారులు, కొందరు డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు ఎగుమతి చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా నాలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటం, జల రవాణాకు అనుకూల వాతావరణం ఉండటంతో జిల్లా కేంద్రంగా దందా మూడు బస్తాలు.. ఆరు లారీల చందంగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

నూకలుగా మార్చి.. ఏమార్చి..!

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో మాఫియా కొత్త ఐడియాకు తెర తీసింది. చిరు వ్యాపారులు, రేషన్ డీలర్లకు ఇందులో పాత్ర ఉంది. కొన్ని ప్రాంతాల్లో రేషన్ డీలర్లే కార్డుదారుల నుంచి బియ్యం కిలోకు రూ.10 చొప్పున చెల్లించి ఈపాస్ మెషీన్‌లో వేలిముద్ర వేయించుకుని పంపుతున్నారు. ఆ బియ్యం తమ దుకాణాల్లో నిల్వ ఉంచుతున్నారు. ఆటోలు, మినీ వ్యాన్లు, లారీల ద్వారా రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ వాటిని నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. తాజాగా ఈ తరహా దోపిడీ అధికమైందని విజిలెన్స్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో విజిలెన్స్ అధికారుల దాడుల్లో నూకలుగా మార్చే యంత్రాలు పట్టుబడటంతో కొత్త తరహా మోసం బహిర్గతమైంది. జిల్లాలో మరికొంత మంది మిల్లర్లు రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని పాలిష్ చేసి విక్రయిస్తున్నట్లు విమర్శలున్నాయి.

నిఘా కట్టుదిట్టం చేశాం



బియ్యం అక్రమ రవాణాపై నిఘా కట్టుదిట్టం చేశాం. బియ్యం పక్కదారి పడుతున్న సమాచారం అందగానే రంగంలోకి దిగుతున్నాం. బియ్యం ఎక్కడెక్కడికి రవాణా చేస్తున్నారన్న విషయమై ఆరా తీస్తున్నాం. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కాపుకాసి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై దాడులు చేస్తున్నాం. పట్టుబడిన సరకును సీజ్ చేస్తున్నాం. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా క్రిమినల్ కేసులు సైతం బనాయిస్తున్నాం. ఇలాంటి వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు బనాయిస్తాం.

-పీవీ రవికుమార్, ఎస్పీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

క్లుప్తంగా

అంతర్వేదిలో భారీ బొంత చేప లభ్యం


మత్స్యకారులకు చిక్కిన భారీ బొంత చేప

సఖినేటిపల్లి: అంతర్వేది సముద్ర జలాలలో మత్స్యకారులకు భారీ బొంత చేప లభించింది. దీని బరువు 24 కేజీలు ఉంది. ధర కేజీ రూ.350 ఉంటుందని మత్స్యకారులు తెలిపారు. విశాఖపట్నం మత్స్యకారులు ఇక్కడి జలాలలో బోటులో వేటాడుతుండగా గేలానికి చిక్కింది. దీనికి కువైట్, దుబాయ్ దేశాలలో భారీ డిమాండ్ ఉందని వారు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు డివిజన్‌కు ఒక పోలింగ్ కేంద్రం

కాకినాడ సిటీ: శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో డివిజన్‌కు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 16న విడుదల అవుతుందన్నారు. ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ దినాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, జాబిబోయిన వెంకటేష్‌నాయుడు, సబ్బారపు అప్పారావు, సత్యనారాయణ, ఎం.రాజశేఖర్, కలెక్టర్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

17న 'నన్నయ'లో కామర్స్ ఫెస్ట్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న రాష్ట్ర స్థాయిలో కామర్స్ ఫెస్టివల్ జరుగనుంది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ని రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ బుధవారం విడుదల చేశారు. 'కమర్షియో 2 కె 23' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో బీకాం తృతీయ సంవత్సరం, ఎంకాం ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొంటారన్నారు. క్విజ్, మేచింగ్ ద అకౌంటింగ్, లాజికల్ కామర్స్, మెమొరీ టెస్ట్ వంటి అకడమిక్ పోటీలు, సాంస్కృతిక పోటీలు జరుగుతాయన్నారు. డైరెక్టర్‌గా ఆచార్య ఎస్.టేకి, కన్వీనర్‌గా డాక్టర్ ఎన్.ఉదయ్‌భాస్కర్, కో కన్వీనర్‌గా డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి వ్యవహరిస్తారు.

ట్రెక్కింగ్ వెహికల్

రాజానగరం మండలం నరేంద్రపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వికాస్ గైడ్ టీచర్ ఆర్‌వీ విజయ సహకారంతో ఈ ప్రాజెక్టు రూపొందించాడు. లోయ ప్రాంతాల్లో ప్రమాదాలను సెన్సార్ ఏర్పాటు ద్వారా నివారించవచ్చు. ప్రమాదాలకు గురైన వాహనాలు ట్రెక్కింగ్ వెహికల్ ద్వారా బయటకు తీసే అవకాశం ఉంటుంది.


ట్రెక్కింగ్ వెహికల్ ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థి వికాస్

అనుబంధ వాస్తవికత

ఉండ్రాజవరం మండలం మోర్తా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.మహేష్ గైడ్‌టీచర్ జి.మహేష్‌కుమార్ సహకారంతో ఈ యాప్‌ను రూపొందించాడు. పిల్లవాడికి అర్థమయ్యే రీతిలో చదివించడంతో పాటు చదువులో ఇన్‌వాల్వ్ చేయడానికి ఇది ఉపయోగిస్తుంది. అమ్మోనియా దేశీయులతో మాట్లాడి యాప్‌ను తయారు చేశారు.


అనుబంధ వాస్తవికతపై ప్రదర్శన ఇచ్చిన విద్యార్థి మహేష్

పేషెంట్ మానిటరింగ్ సిస్టమ్


పేషెంట్ మానిటరింగ్ సిస్టమ్‌ను వివరిస్తున్న విద్యార్థిని వినూత్న

గోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఉన్నత పాఠశాల విద్యార్థి కె.వినూత్న గైడ్ టీచర్ కె.అనిత్ సహకారంతో ఈ ప్రాజెక్టు రూపొందించింది. ప్రస్తుత కాలంలో చాలామంది హార్ట్‌బీట్ ఎక్కువగా ఉండడం వలన మృత్యువాత పడుతున్నారు. హార్ట్‌బీట్ ఎక్కువయినప్పుడు బజర్ సౌండ్ వస్తుంది. వెంటనే వైద్యుణ్ణి సంప్రదిస్తే ఎటువంటి ప్రమాదం ఉండదు. రూ.వెయ్యితోనే దీనిని తయారు చేసుకోవచ్చు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్
- జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం


బెలూన్లు వదిలి ప్రదర్శనను ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్, డీఈవో అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆల్కాట్‌తోటలోని శ్రీసత్యసాయి గురుకులం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శన–2023ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. తమకు ఇష్టమైన రంగంలో రాణించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచన, తార్కిక వివేచన పెంచేలా సైన్స్ బోధన ఉండాలని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల పరిధిలో మండలానికి ఐదు చొప్పున ఎంపిక చేసిన 95 ప్రాజెక్టులను రెండురోజులపాటు జరిగే జిల్లాస్థాయి ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. వీటిలో న్యాయనిర్ణేతల ద్వారా పర్యావరణం–హితం, ఆరోగ్యం– పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్– ఆండ్రాయిడ్ యాప్‌లు, పర్యావరణం–వాతావరణ మార్పులు, గణిత భావన మోడల్స్ విభాగాలలో 10 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఈ నెల 27, 28వతేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనకు పంపుతామన్నారు. **కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.శ్యామ్ వినూత్నంగా తయారు చేసిన బోర్డ్ పై వాటర్ స్ప్రే చేయ**గా..సైన్స్ ఫెయిర్ ప్రారంభం అని రావడంతో కమిషనర్ ముచ్చట పడ్డారు. మానవునికి నిత్య జీవితంలో సైన్స్ ఒక భాగం అయిందన్నారు. అనంతరం ప్రదర్శనలు తిలకించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి డాక్టర్ టి.సుజాత, హెచ్ దేవరాజు, డాక్టర్.బి మల్లికార్జున, జి.శేఖర్‌బాబు, సీహెచ్ సంజీవ కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రూరల్ ఎంఈవో ఎ.తులసీదాస్, సత్య సాయి గురుకులం కరెస్పాండెంట్ ఎ.శ్యాం సుందర్, ప్రిన్సిపాల్ కె.గురవయ్య, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కన్నూరి సతీష్‌బాబు, కమిటీ సభ్యులు కోలా సత్యనారాయణ, ఎస్ఎల్‌వీ రమేష్ ,గణపతి, వెంకట రమణ పాల్గొన్నారు.

ఆటోమేటిక్ వాటరింగ్ సిస్టమ్స్ ఫర్ ప్లాంట్


ఆటోమేటిక్ వాటరింగ్ సిస్టమ్స్ ఫర్ ప్లాంట్ గురించి వివరిస్తున్న సత్యదానందస్వామి

రంగంపేట మండలం వడిశలేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సత్యదానంద స్వామి గైడ్‌టీచర్ డి.సత్యసరోజిని సహకారంతో ఈ ప్రాజెక్టు రూపొందించాడు. ఇంటి యజమానులు ఊరు వెళ్లినప్పుడు మొక్కలు ఎండిపోకుండా సెన్సార్ పెట్టి వెళతారు. మొక్కలకు నీరు అవసరం అయినప్పుడు సెన్సార్ ద్వారా ట్యాంక్‌లో నుంచి నీరు సరఫరా అవుతుంది.

స్మార్ట్ డస్ట్‌బిన్

గోపాలపురం మండలం అన్నదేవరపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.తరుణ్‌సాయి గైడ్ టీచర్ చంద్రమౌళి సహకారంతో ఈ ప్రాజెక్టు రూపొందించాడు. కరోనా సమయంలో డస్ట్‌బిన్‌లు చేతులతో పట్టుకోవడం వలన బాక్టీరియా సోకుతుంది. దీనికి పరిష్కార మార్గంగా చెత్తను తీసుకువెళ్లినప్పుడే డస్ట్‌బిన్ ఓపెన్ అవుతుంది. చెత్తవేసిన తరువాత మూసుకుపోతుంది.


స్మార్ట్ డస్ట్‌బిన్ ప్రదర్శిస్తున్న తరుణ్‌సాయి

రీచార్జ్‌బుల్ స్ప్రేయర్ విత్ సోలార్ పవర్

కోరుకొండ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు వి.శ్యామ్, వెంకట్ గైడ్‌టీచర్ ఆనందబాబు సహకారంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. 800 గ్రాముల బరువుతో లిథియ ఐరన్ ఫాస్పేట్ బ్యాటరీతో పనిచేసే విధంగా రీ చార్జిబుల్ స్ప్రేయర్‌ను తయారు చేశారు. 10 నుంచి 20 ఏళ్ల వరకు పనిచేసే విధంగా రూపొందించారు. రోజుకు 12గంటలపాటు పొలాల్లో స్ప్రేయింగ్ చేయవచ్చు.


రీ చార్జిబుల్ స్ప్రేయర్ విత్ సోలార్ పవర్ గురించి కమిషనర్ దినేష్‌కుమార్‌కు వివరిస్తున్న శ్యామ్

చెడు అలవాట్లకులోనై చోరీల బాట

- నలుగురు యువకుల అరెస్టు
- 14 మోటారు సైకిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లతో సీఐ రజనీకుమార్, ఎస్ఐ మణికుమార్

కొత్తపేట: చెడు అలవాటకు లోనై వాటిని తీర్చుకునే నిమిత్తం మోటార్ సైకిళ్లు చోరీ చేస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, 14 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు రావులపాలెం సీఐ ఎస్. రజనికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వి.మణికుమార్‌తో కలిసి ఆయన మోటార్ సైకిళ్ల చోరీ వివరాలను విలేకరులకు వివరించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న మోటార్ సైకిళ్లు దొంగతనంపై ప్రత్యేక బృందం దర్యాప్తు జరిపి చల్లా పవన్‌కుమార్, యర్రంశెట్టి తరుణతేజ, తోరాటి శ్రీరామమూర్తి, గాదం అవినాష్‌ను అదుపులోకి తీసుకుంది. కొత్తపేటబాబులు కాలనీకి చెందిన ఈ నలుగురు యువకులు మారు తాళాలతో బైక్‌ల తాళాలు తీసి దొంగతనం చేశారని, వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవారని విచారణలో తేలిందని సీఐ వివరించారు. వారి నుంచి 14 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.

ఉభయ తారకంగా..

- సత్తెన్న, చిన వెంకన్న సేవలో చెరో మూడురోజులు
- విద్యుత్ డీఈ సూర్యనారాయణ కోసం పట్టుబట్టిన ఇరు దేవస్థానాల అధికారులు
- మధ్యేమార్గంగా రెండుచోట్లా పనిచేసేలా కమిషనర్ ఆదేశం

అన్నవరం: ఒక సమర్థుడైన అధికారిని ఎవరూ వదులుకోలేరు అనడానికి ఇదో ఉదాహరణ. అన్నవరం దేవస్థానంలో విద్యుత్ శాఖ డీఈగా పనిచేస్తున్న టి.సూర్యనారాయణను తిరిగి ద్వారకాతిరుమల దేవస్థానానికి డిప్యుటేషన్ పై పంపించాలని ఆ దేవస్థానం చైర్మన్ ఎస్‌వీ సుధాకర్‌రావు ఒకవైపు, ఈ దేవస్థానంలో పనులన్నీ పూర్తయ్యేవరకు ఆయనను బదిలీ చేయవద్దని అన్నవరం దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తి మరోవైపు దేవదాయశాఖ కమిషనర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. వారి అభ్యర్థనల మేరకు రెండు దేవస్థానాలలో డీఈ సూర్యనారాయణ మూడేసి రోజుల చొప్పున పనిచేసేలా కమిషనర్ డాక్టర్ సి.జవహర్‌లాల్ ఆదేశాలిచ్చిన వైనం ఆసక్తి కలిగించింది.

ఆరునెలల క్రితం ద్వారకాతిరుమల నుంచి అన్నవరానికి డీఈ బదిలీ

సాధారణ బదిలీలలో భాగంగా ఆరు నెలల క్రితం ద్వారకాతిరుమల దేవస్థానం నుంచి విద్యుత్ శాఖ డీఈ టి. సూర్యనారాయణ అన్నవరం బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడ జాయిన్ అయినప్పటి నుంచి దేవస్థానం విద్యుత్ శాఖ పనితీరులో గణనీయమైన మార్పు తీసుకువచ్చారు. అనేక పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కించారు. కొత్త జనరేటర్ల ఏర్పాటుతో బాటు అవి ఆటోమేటిక్‌గా ఆన్ అండ్ ఆఫ్ అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నారు. రూ.4.5 కోట్లు వ్యయంతో నూతన సబ్‌స్టేషన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. రూ.16 కోట్లతో నిర్మిస్తున్న శివసదన్ సత్రంలో రూ.కోటి వ్యయంతో ఏసీ, గ్రీజర్లు ఏర్పాటుకు టెండర్లు కూడా ఖరారు చేశారు. 18 సంవత్సరాలుగా వెలగని విష్ణునామాన్ని దాతల సహకారంతో తిరిగి వెలిగించారు. రెండు గోపురాలకు బంగారు రంగు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

ద్వారకాతిరుమలకు రెండేళ్లు డిప్యుటేషన్‌పై పంపాలని వినతి

డీఈ సూర్యనారాయణ ద్వారకాతిరుమల దేవస్థానంలో విద్యుత్ విభాగంలో కూడా తన పనితీరుతో గణనీయమైన మార్పు తీసుకొచ్చారు. ఆయన బదిలీతో ద్వారకాతిరుమల దేవస్థానంలో విద్యుత్ విభాగ పనులు నత్తనడకన నడుస్తుండడంతో మళ్లీ ఆయనను రెండేళ్లపాటు ద్వారకాతిరుమల దేవస్థానానికి డిప్యుటేషన్‌పై పంపించాలని ఆ దేవస్థానం చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు కమిషనర్‌ను కోరారు. దీంతో కమిషనర్ ఆ మేరకు ఆదేశాలిచ్చారు.

ఇక్కడ పనులు పూర్తయ్యేవరకు కొనసాగించాలని అన్నవరం ఈఓ లేఖ

అయితే డీఈ సూర్యనారాయణ ద్వారకాతిరుమల దేవస్థానం వెళ్లిపోతే అన్నవరం దేవస్థానంలో విద్యుత్ విభాగంలో చేపట్టిన పనులన్నీ ఆగిపోతాయని, ఆయనను ఈ పనులన్నీ పూర్తయ్యేవరకు ఇక్కడే కొనసాగించాలని దేవస్థానం ఈఓ ఎస్‌వీ సత్యనారాయణమూర్తి దేవదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. గత ఆరు నెలల్లో ఆయన చేపట్టిన పనులు, వాటి పురోగతి అందులో వివరించారు.

చెరో మూడు రోజులు పనిచేసేలా కమిషనర్ ఆదేశాలు


డీఈ సూర్యనారాయణ

దీంతో రెండేళ్లపాటు ద్వారకాతిరుమల దేవస్థానంలో డిప్యుటేషన్‌పై పనిచేసేలా గతంలో ఇచ్చిన ఆదేశాలను కమిషనర్ డాక్టర్ టి.హరి జవహర్‌లాల్ సవరించారు. అన్నవరం దేవస్థానానికి సంబంధించిన మేజర్ పనులు పూర్తయ్యేవరకు వారానికి మూడు రోజులు ఇక్కడ పనిచేయాలని ఆదేశించారు. మిగిలిన మూడు రోజులు తూర్పు గోదావరి జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పనిచేయాలని ఆదేశాలిచ్చారు. దేవస్థానంలో చేపట్టిన పనులు మే నెలకల్లా పూర్తవుతాయని డీఈ సూర్యనారాయణ 'సాక్షి'కి తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కొత్తపేట: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలుడి ఆచూకీ కనుగొన్న పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లా పెద్దవలస గ్రామానికి చెందిన మామిడి గంగరాజు, సుధ దంపతులు తమ నాలుగేళ్ల కుమారుడు శ్యామ్‌తో కపిలేశ్వరపురం మండలం కేదార్లంక పంచాయతీ పరిధిలోని వీధివారిలంక వచ్చి ఇటుక బట్టీలో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి బాలుడు శ్యామ్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించగా ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ వి. మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఆ బాలుడు బోడిపాలెం దిగువన బ్రాందీషాపు సమీపంలో ఇటుకబట్టీల వద్ద ఏఎస్సై కృష్ణారావు, హెచ్‌సీ ప్రసాద్‌కు కనిపించగా వారు ఆ బాలుడిని తీసుకువెళ్లి తల్లిదండ్రులకు అప్పగించారు.బాలుడి తల్లిదండ్రులు ఆనందంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి పట్టివేత

- 500 కేజీల సరకు, స్కార్పియో వాహనం సీజ్
- ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనం, నిందితులతో రావులపాలెం పోలీసులు

రావులపాలెం: అక్రమ సంపాదనకు ఆశపడి చెడు మార్గాలను ఎంచుకున్న ఇద్దరు యువకులు గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం ఈతకోట హైవే పై మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రావులపాలెం వైపు నుంచి తణుకు వైపు వెళుతున్న స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో వాహనంలో ఉన్న అనకాపల్లి జిల్లా మోకాసుకొత్తపట్నంకు చెందిన ఈపు రాజేష్, నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన పోలవరపు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 500 కేజీల గంజాయిని, రవాణాకు ఉపయోగిస్తున్న స్కార్పియో వాహనాన్ని సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి బుధవారం సాయంత్రం నిందితులను రిమాండ్ నిమిత్తం కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించారు.

అట్టహాసంగా జాతీయ విమెన్ సీనియర్స్ హాకీ పోటీలు

- హాకీ అభివృద్ధికి కృషి
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్
- 15 నుంచి 26 వరకు నిర్వహణ
- 26 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరు



గుజరాత్, పంజాబ్ జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హాకీ ఆస్ట్రోటర్ఫ్ మైదానం కాకినాడకు రావడంలో తన పాత్ర ఉందని, ఈ హాకీ మైదానంలో కావల్సిన ఇతర సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా హాకీ సంఘం సహకారంతో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జాతీయ సీనియర్స్ విమెన్ హాకీ చాంపియన్ షిప్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి హాకీ ఆంధ్రప్రదేశ్ గౌరవ సలహాదారుడు నిరంజన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలలో క్రీడాస్ఫూర్తితో రాణించాలని కోరారు. గౌరవ అతిథి కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో జూనియర్స్ విభాగంలో పోటీలు విజయవంతంగా నిర్వహించామన్నారు. క్రీడామైదానంలో ఫ్లడ్‌లైట్స్ సౌకర్యం కల్పిస్తానన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారిణులు కాకినాడకు రావడం గర్వకారణం అన్నారు. 80 సంవత్సరాల హాకీ చరిత్రలో తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం వల్ల ఈ టోర్నీని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేశామన్నారు. హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజ్, కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, కోఆర్డినేటర్ రవిరాజు మాట్లాడారు. అనంతరం జాతీయ జెండాను కలెక్టర్, హాకీ ఇండియా జెండాను నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ జెండాను కాకినాడ మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆవిష్కరించారు. పోటీల ప్రారంభ సూచకంగా కలెక్టర్ బెలూన్లు, శాంతి కపోతాలను ఎగురవేశారు. కమిషనర్ మీట్ డిక్లరేషన్ చేశారు. ముఖ్యఅతిథులు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. డీఎస్ఏ సీఈఓ సునీత, చీఫ్‌కోచ్ శ్రీనివాస్‌కుమార్, పీడీలు, పీఈటీలు, వివిధ రాష్ట్రాల కోచ్‌లు, మేనేజర్‌లు పాల్గొన్నారు.


హాకీ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న కలెక్టర్

తొలిరోజు రోజు విజేతల వివరాలు

జాతీయ విమెన్ హాకీ పోటీలలో తొలిరోజు బుధవారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి మ్యాచ్‌లో హాకీ పంజాబ్, హాకీ గుజరాత్ పోటీపడ్డాయి. నిర్ణీత సమయంలో 13–0 స్కోర్‌తో పంజాబ్ గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో హాకీ ఉత్తరప్రదేశ్, హాకీ బెంగాల్ జట్లు తలపడ్డాయి. హాకీ బెంగాల్ 1–0 స్కోర్‌తో గెలుపొందింది. మ్యాచ్‌లను టోర్నీ పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.